సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 30 । సెప్టెంబర్ । 2025



భద్రాచలంలో ఆర్టీసీ అధికారులు తయారుచేసిన కాగితపు బతుకమ్మ

బతుకమ్మా.. మళ్లీ రావమ్మా..

జిల్లాలో తొమ్మిది రోజుల పాటు ఆడపడుచులు ఉత్సాహంగా ఆడిన బతుకమ్మ వేడుకలు సోమవారం సద్దుల సంబురంతో ముగిశాయి. తీరొక్క పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలతో మహిళలు ప్రదర్శనగా వెళ్లి.. ఉత్సాహంగా ఆడుతూ.. పాడుతూ సందడి చేశారు. బతుకమ్మకు పలు రకాల నైవేద్యాలు సమర్పించి చివరకు చెరువులో నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. 'వెళ్లిరా బతుకమ్మా.. మళ్లీ రావమ్మా' అంటూ గౌరమ్మను వేడుకున్నారు. కాగా, అధికారులు ఆయా గ్రామాల్లో బతుకమ్మ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భద్రాచలం బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ అధికారులు ఏర్పాటుచేసిన కాగితపు బతుకమ్మ విశేషంగా ఆకట్టుకుంది.

9లో





కొత్తగూడెంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

న్యూస్‌రీల్

శ్రీ సరస్వతీదేవిగా పెద్దమ్మతల్లి



శ్రీ సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న పెద్దమ్మతల్లి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో అమ్మవారిని సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతీదేవిగా అలంకరించారు. అనంతరం చండీహోమం, లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేశారు. ఖమ్మం ఎంపీ ఆర్.రఘురాంరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈఓ, ఆలయ కమిటీ చైర్మన్ ఆయనకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలు అందజేశారు.

ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్

భద్రాచలంటౌన్: ఆర్టీసీలో వేయి మంది డ్రైవర్లు, 743 శ్రామిక్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడిందని, ఉమ్మడి జిల్లాలో అర్హత కలిగిన గిరిజన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. www. tgprb. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. 22 – 40 ఏళ్ల వయస్సు కలిగిన వారు డ్రైవర్లుగా, 18 – 35 ఏళ్ల వయస్సు వారు శ్రామిక్ పోస్టులకు అర్హులని వెల్లడించారు. డ్రైవర్ పోస్టుకు రూ.300, శ్రామిక్ పోస్టుకు రూ.200 చెల్లించి అక్టోబర్ 8నుంచి 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని పీఓ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎట్టకేలకు దీక్ష విరమణ

- జాయింట్ సర్వేకు ఆదేశించిన కలెక్టర్



ఎనిమిదో రోజు దీక్ష చేస్తున్న ఆదివాసీలు


సూపర్‌బజార్(కొత్తగూడెం): అశ్వారావుపేట మండలం రామన్నగూడెం ఆదివాసీలు.. భూ సమస్య పరిష్కరించాలంటూ ఎనిమిది రోజులుగా చేస్తున్న నిరవధిక దీక్ష సోమవారం రాత్రి ముగిసింది. రెవెన్యూ, అటవీ శాఖల ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించేందుకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారని, ఈ మేరకు సర్వే చేపడతామని అశ్వారావుపేట తహసీల్దార్ రామకృష్ణ హామీ ఇవ్వడంతో ఆదివాసీలు దీక్ష విరమించి ఇంటిబాట పట్టారు. కాగా, అశ్వారావుపేట తహసీల్దార్, ఎఫ్ఆర్ఓ ఆధ్వర్యంలో జాయింట్ సర్వే నిర్వహించనున్నట్టు ఆర్డర్ కాపీ అందిన నేపథ్యంలో దీక్ష విరమిస్తున్నటు ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి మడకం నాగేశ్వరరావు సోమవారం రాత్రి 'సాక్షి'కి తెలిపారు.

ఉద్యాన పంటలతో అదనపు ఆదాయం

అశ్వారావుపేటరూరల్: ఉద్యాన పంటలు సాగు చేసి అదనపు ఆదాయం పొందాలని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ శాఖ జిల్లా అధికారి జంగా కిషోర్ రైతులకు సూచించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాల పరిధిలోని పామాయిల్, కొబ్బరి ఇతర పంటల్లో అంతర పంటలుగా సాగు చేస్తున్న కోకో, వక్క, అరటి, బొప్పాయి, పూల తోటలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంతర పంటల సాగుతో ప్రభుత్వం నుంచి సబ్సిడీతోపాటు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. అరటి పంట సాగు చేస్తే ఎకరానికి రూ.28 వేలు, బొప్పాయికి రూ.12వేలు, పూల తోటలకు రూ.8వేలు, కోకో పంటకు రూ.12వేలు, మామిడికి రూ.20వేల చొప్పున సబ్సిడీ వస్తుందని వివరించారు. కలుపు నివారణకు ప్లాస్టిక్ మల్చింగ్ వినియోగిస్తే ఎకరానికి రూ.8 వేల సబ్సిడీ అందుతుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఈఓ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక పోరుకు సై..





స్థానిక సంస్థల ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సోమవారం షెడ్యూల్ ప్రకటించింది. మొదట ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు, ఆ తర్వాత గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరుగనున్నాయి. పరిషత్ ఎన్నికలు రెండు విడతల్లో, గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఎన్నికల ప్రక్రియ అక్టోబర్ 9న ప్రారంభమై నవంబర్ 11తో ముగియనుంది. ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో జిల్లాలో రాజకీయ సందడి ప్రారంభమైంది. – చుంచుపల్లి

అక్టోబర్ 23, 27న పరిషత్‌లకు..

ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికలు జరుగనున్నాయి. పంచాయతీలకు అక్టోబర్ 31, నవంబర్ 4, 8 తేదీల్లో మూడు విడతలుగా పోలింగ్ జరగనుంది. పంచాయతీల్లో పోలింగ్ ముగిసిన వెంటనే ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల ఫలితాలను మాత్రం నవంబర్ 11న ప్రకటిస్తారు. పరిషత్ ఎన్నికలకు మొదటి విడత నోటిఫికేషన్ అక్టోబర్ 9న, రెండో విడత నోటిఫికేషన్‌ను 13న విడుదల చేసి, అదేరోజు నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. పంచాయతీలకు తొలి విడత నోటిఫికేషన్ అక్టోబర్ 17న, రెండో విడత నోటిఫికేషన్ 21న, మూడో విడత నోటిఫికేషన్ 25న విడుదల చేసి అదేరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ చేపడతారు. ఈ మేరకు అధికారులు ఇప్పటికే అన్ని గ్రామాల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ, పంచాయతీ, వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలను అందుబాటులో ఉంచారు. షెడ్యూల్ ప్రకటనతో గ్రామాల్లో రాజకీయ సందడి నెలకొనగా.. ఆశావహులు బరిలో నిలిచేందుకు ప్రయత్నాల్లో మునిగిపోయారు. రిజర్వేషన్లు అనుకూలించని చోట కొందరు నైరాశ్యంలో ఉన్నారు.

మోగిన పంచాయతీ, పరిషత్ ఎన్నికల నగారా

- ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు రెండు విడతల్లో పోలింగ్
- గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో..
- జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు
- 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డులు

11 మండలాల చొప్పున..

జిల్లాలో 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. వీటికి సంబంధించిన రిజర్వేషన్ల ప్రక్రియను అధికారులు ఇటీవలే పూర్తి చేశారు. జిల్లాలోని 11 జెడ్పీటీసీ స్థానాలు, వాటి పరిధిలోని 113 ఎంపీటీసీ స్థానాలకు అక్టోబర్ 23న తొలి విడతలో పోలింగ్ నిర్వహించనున్నారు. వీటిలో అశ్వాపురం మండలంలో 12, భద్రాచలంలో14, బూర్గంపాడులో 17, చర్లలో 12, దుమ్ముగూడెంలో 13, కరకగూడెంలో 5, మణుగూరులో 11, పినపాకలో 9, ఆళ్లపల్లిలో 5, గుండాలలో 5, జూలూరుపాడు మండలంలోని 10.. మొత్తం 113 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. మలి విడత అక్టోబర్ 27న చుంచుపల్లి మండలంలోని 12, లక్ష్మీదేవిపల్లిలో 11, సుజాతనగర్‌లో 5, పాల్వంచలో 10, దమ్మపేటలో 17, అశ్వారావుపేటలో 11, ములకలపల్లిలో 10, చంద్రుగొండలో 8, అన్నపురెడ్డిపల్లిలో 6, టేకులపల్లిలో 14, ఇల్లెందు మండలంలోని 16.. మొత్తం 120 ఎంపీటీసీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. జెడ్పీటీసీ స్థానాలకు తొలి, మలి విడతల్లో 11 స్థానాల చొప్పున ఎన్నికలు ఉంటాయి. కాగా, జిల్లాలో ఇప్పటికే ఓటరు జాబితాలు, బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, సిబ్బంది, నోడల్ అధికారుల నియామకం పూర్తయింది. ఇప్పటికే రెండు విడతలుగా ఆర్ఓలు, ఏఆర్ఓలకు, పీఓలు, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఇక జిల్లాలో 471 గ్రామ పంచాయతీలు, 4,168 వార్డు స్థానాలు ఉండగా అక్టోబర్ 31న అశ్వాపురం, బూర్గంపాడు, భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల కరకగూడెం, మణుగూరు, పినపాక మండలాల్లోని 159 జీపీలు, 1,436 వార్డులకు, నవంబర్ 4 అన్నపురెడ్డిపల్లి, అశ్వారావుపేట, చంద్రుగొండ, చుంచుపల్లి, దమ్మపేట, ములకలపల్లి, పాల్వంచ మండలాల్లోని 156 జీపీలు, 1,392 వార్డులకు 8వ తేదీన ఆళ్లపల్లి, గుండాల, జూలూరుపాడు, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, టేకులపల్లి, ఇల్లెందు మండలాల్లోని 156 పంచాయతీలు, 1,340 వార్డులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్పంచ్‌లకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగు బ్యాలెట్ పేపర్లు ముద్రించి భద్ర పర్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు 10,223 మంది, పరిషత్ ఎన్నికలకు 8,711 మంది సిబ్బందిని కేటాయించారు. పంచాయతీలకు 4,242, పరిషత్ ఎన్నికలకు 1,271 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. కాగా, ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సిబ్బంది నియామకం, మొదటి విడత శిక్షణ తరగతులు పూర్తయ్యాయని చెప్పారు.

'పేట'లో ఆర్టీసీ డిపో

- అశ్వారావుపేట వాసుల రవాణా కష్టాలకు ఇక చెక్
- ఇల్లెందు డిపో సమస్యలు పరిష్కారమెప్పుడో ?
- పాల్వంచ స్టేషన్ విస్తరణ, మణుగూరుకు మొండిచేయి
- భద్రాచలం, కొత్తగూడెం బస్ స్టేషన్లకూ దక్కని అవకాశం



అశ్వారావుపేట బస్‌స్టేషన్

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆర్టీసీ బస్సులు లేక అశ్వారావుపేట ప్రజలు ఇన్నాళ్లూ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఏజెన్సీకి పెద్ద దిక్కుగా ఉన్న పేట వాసులు ఇంతకాలం సత్తుపల్లి డిపో పైనే ఆధారపడ్డారు. సత్తుపల్లి నుంచి అశ్వారావుపేటకు 33 కి.మీ. దూరంలో ఉండడంతో ఉదయం, రాత్రి వేళ సర్వీసులకు కష్టంగా ఉండేది. జంగారెడ్డిగూడెం నుంచి అశ్వారావుపేట మీదుగా ఇటు ఖమ్మం, అటు భద్రాచలం వెళ్లే బస్సులే ప్రధాన ఆధారంగా ఉండేవి. చివరకు జిల్లా కేంద్రమైన కొత్తగూడెం రావడానికి కూడా దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి మండలాల ప్రజలు ఇబ్బంది పడేవారు. మరోవైపు వేలేరుపాడు, కుక్కునూరు మండలాల ప్రజలు భద్రాచలం రావడానికి కష్టంగా ఉండేది. అశ్వారావుపేట కేంద్రంగా కొత్త డిపో వస్తుండడంతో ఈ సమస్యలు తీరనున్నాయి. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో ఇల్లెందులో శాటిలైట్ డిపో ప్రారంభమైంది. రెండేళ్లు దాటినా ఇప్పటికీ అక్కడ పెట్రోల్ బంక్ నిర్మించలేదు. ఇప్పటికైనా దీనికి పూర్తి స్థాయి డిపో హోదా ఇవ్వాలని ఇల్లెందు ప్రాంత వాసులు కోరుతున్నారు. ఇల్లెందు నుంచి కేవలం 50 కి.మీ. దూరంలో ఉండే ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్‌కు నిత్యం వందలాది షటిల్ సర్వీసులు తిరుగుతుంటాయి. దీంతో ఇల్లెందు కేంద్రంగా ఈవీ బస్సులు నడపడం సులభం. ఈ క్రమంలో ఇల్లెందు డిపో కేంద్రంగా ఎలక్ట్రిక్ (ఈవీ) బస్సులు నడిపించే అంశాన్ని పరిగణనలోకి తీసుకోవచ్చు. అవసరమైతే దీన్ని ఈవీ బస్‌డిపోగా మార్చేందుకు కూడా అనువైన పరిస్థితులు ఉన్నాయి.

బస్‌స్టేషన్లకు కొత్త కళ..

నిత్యం వందలాది బస్సులు వచ్చి పోయే పాల్వంచ బస్‌స్టేషన్‌లో కనీస సౌకర్యాలు లేవు. బస్సులు నిలిపేందుకు సరైన ప్లాట్‌ఫామ్‌లు కూడా లేవు. భద్రాచలం, మణుగూరులకు, ఖమ్మం, కొత్తగూడెంకు కలిసి ఒకే దగ్గర పాయింట్లు ఉన్నాయి. దీంతో రద్దీ కారణంగా కొన్ని బస్సులు పూర్తిగా ప్లాట్‌ఫామ్ మీదకు రాకుండానే వెళ్తున్నాయి. గతంలో రవాణా శాఖ మంత్రిగా పువ్వాడ అజయ్‌కుమార్ హయాంలో అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర సౌకర్యాల పనులకు శంకుస్థాపన చేసినా ముందుకు సాగలేదు. దీంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఆగిపోయాయి. తాజా మంజూరులోనైనా ఈ పనులు చేపట్టాలని పాల్వంచ వాసులు కోరుతున్నారు. ఇక దమ్మపేట బస్టాండ్‌లోకి బస్సు వెళ్లడమంటే పద్మవ్యూహమే అనే పరిస్థితి ఉంది. అయితే తాజాగా ఈ స్టేషన్ ఆవరణలో సీసీ రహదారి మంజూరు కావడంతో ఈ సమస్య తీరినట్టే. మందలపల్లి బస్టాండ్ అభివృద్ధికీ నిధులు విడుదలయ్యాయి.

మణుగూరుకు నిరాశే..

దశాబ్దాలు దాటినా మణుగూరు బస్ స్టేషన్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. 90వ దశకంలో ఊరికి దూరంగా బస్టాండ్ నిర్మించడంతో ప్రజలు ఎక్కువగా వినియోగించలేదు. దీంతో బండారుగూడెంలో సురక్ష పేరుతో నిర్మించిన తాత్కాలిక బస్‌స్టేషన్‌నే నేటికీ ఉపయోగిస్తున్నారు. బస్‌డిపో ఆవరణలోనే కొత్త బస్టాండ్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో శంకుస్థాపన చేసినా పనులు జరగలేదు. దీంతో ఆ ప్రాంగణమంతా పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ఇప్పటికైనా మణుగూరులో కొత్త బస్టాండ్ నిర్మించాల్సిన అవసరముంది. దమ్మపేట (మందలపల్లి) తరహాలో చంద్రుగొండ బస్‌స్టేషన్‌లో సౌకర్యాలు కల్పించడంతో పాటు బూర్గంపాడు బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

వీటి సంగతేంటి..?

జిల్లాలో కొత్తగూడెం, భద్రాచలంలో ప్రధాన బస్‌స్టేషన్లు ఉన్నాయి. కొత్తగూడెం బస్టాండ్ నిర్మించి 50 ఏళ్లు దాటగా భవనం శిథిలావస్థకు చేరుతోంది. పైకప్పు పెచ్చులూడిపడుతున్నాయి. వర్షం పడితే స్టేషన్ కురుస్తోంది. దీన్ని పూర్తిగా తొలగించి మల్టీ పర్పస్ స్టేషన్‌గా నిర్మించాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అనేకసార్లు కోరారు. సీఎం రేవంత్ రెడ్డికి స్వయంగా విన్నవించారు. అయితే తాజా అభివృద్ధి పనుల్లో కొత్తగూడెం స్టేషన్‌కు స్థానం దక్కలేదు. వేలాదిగా భక్తులు వచ్చి పోయే భద్రాచలం బస్‌స్టేషన్‌లో యాత్రికులకు లాకర్లు, డార్మిటరీలు, స్నానాల గదులు, క్లోక్‌రూమ్, పెయిడ్ రూమ్స్ వంటి సదుపాయాలు లేవు. కేవలం బస్సు వచ్చిపోయేందుకు వీలుగానే ఈ స్టేషన్ ఉంది. యాత్రికుల అవసరాలు తీర్చేలా ఈ బస్‌స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేస్తే ఇటు ప్రజలకు సౌకర్యంతో పాటు ప్రభుత్వానికీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇక్కడ ప్రత్యేకంగా ఇంటర్ స్టేట్ బస్ పాయింట్స్‌ను కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

అష్టైశ్వర్య ప్రాప్తిరస్తు..

- ఐశ్వర్యలక్ష్మిగా అమ్మవారి దర్శనం
- నేడు వీరలక్ష్మి అలంకరణలో లక్ష్మీతాయారమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

భద్రాచలం: అఖిలాండ కోటి శాసకురాలిగా, కరుణాస్వరూపినిగా అష్టైశ్వర్య ప్రాప్తిరస్తు అంటూ దీవిస్తున్న అమ్మవారిని దర్శించుకుని భక్తులు పరవశించిపోయారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీతాయారమ్మవారు సోమవారం ఐశ్వర్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం సామూహిక కుంకుమార్చన జరిపారు. చిత్రకూట మండపంలో జరుగుతున్న శ్రీరామాయణ పారాయణోత్సవాల్లో భాగంగా వేద పండితులు, అర్చకులు యుద్ధకాండ పారాయణం చేశారు.

నేటి వీరలక్ష్మి అలంకార విశిష్టత..

'దారిద్ర్య ధ్వంసినీందేవీం సర్వోపద్రవవారిణీం..' అని అమ్మవారిని వీరలక్ష్మీగా కీర్తిస్తుంది పురాణం. దారిద్ర్యాన్ని, అన్ని రకాల ఉపద్రవాలను పారదోలే వీరత్వం ఈ అమ్మ సొంతమని, త్రిమూర్తులకు సైతం సాధ్యం కాని మహిషాసురిని, ముగ్గరమ్మల శక్తి స్వరూపంగా ఆవిర్భవించి సంహరించిందని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ అమ్మను ఆరాధిస్తే అన్ని రకాల దుష్ట శక్తులు, భయాలు, ఉపద్రవాలు తొలగిపోతాయని పండితులు అంటున్నారు.


ముత్తంగి అలంకరణలో రామయ్య..

దేవస్థానంలోని మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

2న విజయదశమి వేడుకలు..

అక్టోబర్ 2వ తేదీన విజయదశమిని పురస్కరించుకుని విజయోత్సవం, శమీ పూజ, ఆయుధ పూజ, శ్రీరామలీలా మహోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా రామదాసు మండపం వద్ద ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే అశ్వయుజ పౌర్ణమి రోజున శబరి స్మృతియాత్ర నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

ఘనంగా ఆయుధ పూజ



ఆయుధపూజకు హాజరైన ఎస్పీ తదితరులు

చుంచుపల్లి: దసరా నవరాత్రుల సందర్భంగా హేమచంద్రాపురం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో సోమవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ.. భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు జరపడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ప్రజలకు, పోలీస్ అధికారులు, సిబ్బందికి సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేందర్, డీఎస్పీలు రెహమాన్, మల్లయ్య స్వామి, సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమం అమల్లో భాగంగా పంచాయతీల సమగ్రాభివృద్ధి కోసం విలేజ్ యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్ నుంచి సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అన్ని శాఖల అధికారులతో మాట్లాడారు. కర్మయోగి కార్యక్రమం కింద గల 130 గ్రామ పంచాయతీల్లో ఈ ప్లాన్ అత్యవసరమని చెప్పారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా బోర్‌వెల్ మరమ్మతులు, కొత్త బోర్లు, రోడ్లు, వాటర్ ట్యాంకులు, విద్యుత్ సదుపాయం, వ్యవసాయ ఆధునీకీకరణ, డ్రోన్ల వినియోగం, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం, విద్యార్థులకు డైనింగ్ హాళ్లు, వైద్య సౌకర్యం పంటల విస్తీర్ణం వంటి అంశాలను యాక్షన్ ప్లాన్‌లో చేర్చాలని ఆదేశించారు. విలేజ్ యాక్షన్ ప్లాన్‌ను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను ఐటీడీఏ పీఓ రాహుల్ పర్యవేక్షిస్తారని తెలిపారు. అక్టోబర్ 2న ఆది కర్మయోగి అభియాన్ అమలవుతున్న 130 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాలని, ప్రజల అవసరాలు, అభివృద్ధి సూచనలు, కార్యాచరణపై చర్చించాలని సూచించారు. గ్రామాల సమగ్రాభివృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని ఆదేశించారు.

మళ్లీ పెరిగిన గోదావరి

కొనసాగుతున్న మొదటి ప్రమాద హెచ్చరిక



భద్రాచలం వద్ద ఉధృతంగా గోదావరి

భద్రాచలంటౌన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరిగింది. సోమవారం రాత్రి 10 గంటలకు 46.70 అడుగులకు చేరింది. శనివారం రాత్రి 43 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. అయితే ఆదివారం రాత్రి 42.70 అడుగులకు చేరడంతో ప్రమాద హెచ్చరిక ఉపసంహరించారు. కాగా, సోమవారం ఉదయం నుంచి మళ్లీ పెరగడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటిమట్టం 46 అడుగులకు పైగా నమోదు కావడంతో భద్రాచలం నుంచి చర్లతో పాటు ఏపీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పరీవాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. బతుకమ్మల నిమజ్జనానికి గోదావరిలోకి అధికారులు చర్యలు చేపట్టారు. కాగా, మంగళవారం మధ్యాహ్నానికి నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం ఉందని అధికారుల అంచనా.

నీట మునిగిన తూరుబాక రోడ్డు

దుమ్ముగూడెం : గోదావరి ప్రవాహం పెరగడంతో మండలంలోని తూరుబాక వద్ద డైవర్షన్ రోడ్డుపైకి వరద చేరింది. దీంతో అధికారులు రాకపోకలు నిలిపివేశారు. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద వస్తుండడంతో పర్ణశాల, కాశీనగరం, సున్నంబట్టి, దుమ్ముగూడెం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. పర్ణశాల నారచీరల ప్రాంతం పూర్తిగా నీట మునగగా సున్నంబట్టి – బైరాగుల పాడు రహదారి పైకి నీరు చేరింది.

క్లుప్తంగా

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

మణుగూరు రూరల్‌ : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పని చేయాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని అన్నారు. బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ విడుదల చేసిన బాకీ కార్డును కూడా ఇంటింటికి పంచాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు కుర్రి నాగేశ్వరరావు, నాయకులు లక్ష్మణ్‌, అప్పారావు, యూసుఫ్‌, నర్సింహారావు, ప్రభుదాసు, పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ జరపాలి

భద్రాచలంటౌన్‌: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో డీడీగా పనిచేసి మణెమ్మ అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని గిరిజన హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పృథ్వీనాయక్‌ సోమవారం ఐటీడీఏ పీఓ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత లేని మెనూ అమలు చేసి గిరిజన విద్యార్థులు అనారోగ్యం పాలవ్వడానికి కారణమయ్యారని తెలిపారు. వసతి గృహాల మరమ్మతులు, సరుకుల టెండర్లు, డిప్యూటేషన్లలో అవకతవకలు జరిగాయని ఆరోపించారు.

డివైడర్‌ను ఢీకొట్టి కంటైనర్‌ బోల్తా



ఘటనాస్థలంలో కంటైనర్‌

ఏన్కూరు: కొత్తగూడెం నుండి ఖమ్మం వైపు వెళ్తున్న కంటైనర్‌ ఏన్కూరులోని డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. సోమవారం తెల్ల వారుజామున ఈ ఘటన జరగగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇక్కడ తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు, ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు.

ఇద్దరికి ఆరు నెలల జైలుశిక్ష

ఖమ్మం లీగల్‌: తీసుకున్న అప్పు చెల్లించే క్రమాన ఇచ్చిన చెక్కు చెల్లకపోవడంతో ఖమ్మం కవిరాజ్‌నగర్‌ ప్రాంతానికి చెందిన సీహెచ్‌.సురేష్‌బాబు, వడిగాశిల్ప శశికళారాణికి ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ ఖమ్మం ఒకటో అదనపు ప్రథమశ్రేణి కోర్టు న్యాయాధికారి బి.రజని సోమవారం తీర్పుచెప్పారు. ఖమ్మం నెహ్రూనగర్‌కు చెందిన జె.రామ జగ్గారావు వద్ద సురేష్‌, శశికళారాణి 2020 ఫిబ్రవరిలో రూ.6 లక్షల అప్పు తీసుకున్నారు. తిరిగి 2021 ఫిబ్రవరిలో రూ.6 లక్షలకు చెక్కు ఇచ్చినా వారి ఖాతాలో సరిపడా నగదు లేక తిరస్కరణకు గురైంది. దీంతో జగ్గారావు తన న్యాయవాది ద్వారా లీగల్‌ నోటీస్‌ జారీ చేసి కోర్టులో ప్రైవేట్‌ కేసు దాఖలు చేశారు. ఈమేరకు ఇద్దరికి జైలుశిక్ష విధించడమే కాక ఫిర్యాదికి రూ.6లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచరూరల్‌: మద్యం తాగొద్దని తల్లి మందలించినందుకు ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణ పరిధిలోని మారుతినగర్‌కు చెందిన పంతంగి ఉపేందర్‌(46) సీతారాంపట్నం విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 27న మద్యం తాగి ఇంటికి రాగా తల్లి ఈశ్వరమ్మ మందలించింది. దీంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లి పురుగుల మందుతాగాడు. అపస్మారక స్థితిలో పడిపోగా స్నేహితులు పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి మెరుగైన వైద్యంకోసం కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పట్టణ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

స్వరాష్ట్రంలో తొలి పోరు



భద్రాచలం మండల పరిషత్‌

ఈసారి భద్రాచలంలోనూ పరిషత్‌, పంచాయతీ ఎన్నికలు

- విలీన, మున్సిపల్‌ సమస్యలతో 2018లో ఎన్నికలు జరగని వైనం
- జెడ్పీటీసీ బీసీ మహిళ.. సర్పంచ్‌ ఎస్టీ జనరల్‌కు రిజర్వేషన్‌



భద్రాచలం గ్రాపమంచాయతీ కార్యాలయం

భద్రాచలం: స్థానిక సంస్థల ఎన్నికలకు భద్రగిరి సిద్ధమవుతోంది. రాష్ట్రమంతటా గతంలో స్థానిక ఎన్నికలు జరిగినా భద్రాచలంలో ఎన్నికలు నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక భద్రాచలంలో మండల పరిషత్‌, గ్రామపంచాయతీ ఎన్నికలు ఇవే తొలిసారి కానున్నాయి. భద్రాచలం మండల పరిషత్‌ జనవరి 1, 1987న ఏర్పడింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారిగా 2014లో రాష్ట్ర విభజనకు ముందు మండల పరిషత్‌ ఎన్నికలు జరిగాయి. ఆ పాలకవర్గ కాలం 2018లో ముగిసింది. నాడు 13 ఎంపీటీసీలకు ఎన్నికలు జరగగా, చివరి జెడ్పీటీసీగా జి.రవికుమార్‌ బాధ్యతలు నిర్వహించారు. ఎన్నికల అనంతరం జరిగిన రాష్ట్ర విభజనలో భద్రాచలం మండలం మినహా ఇతర(పోలవరం ముంపు) గ్రామాలన్నీ ఏపీలో విలీనం చేశారు. పాలకవర్గం కాలం ముగిసిన అనంతరం మళ్లీ ఎన్నికలను జరపలేదు. ఆ తర్వాత నిర్వీర్యంగా మారిన మండల పరిషత్‌ను నూతనంగా ఏర్పాటు చేసిన ఆళ్లపల్లి మండలానికి తరలించారు. మళ్లీ కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చాక కొద్ది నెలల క్రితం తిరిగి భద్రాచలానికి మండల పరిషత్‌ కేటాయించారు. దీంతో తెలంగాణ రాష్ట్రంలో తొలిసారిగా ఎన్నికలు జరగనున్నాయి. 2014లో 13 ఎంపీటీసీలు ఉండగా, ఇప్పుడు 14కు పెంచారు. జెడ్పీటీసీ బీసీ మహిళకు, ఎంపీపీని గిరిజన మహిళకు కేటాయించారు. 20 వార్డుల్లో 60 పోలింగ్‌ బూత్‌లలో ఎన్నికలు నిర్వహించనున్నారు.

మేజర్‌ గ్రామపంచాయతీకీ..

మేజర్‌ గ్రామపంచాయతీగా ఉన్న భద్రాచలం మున్సిపాలిటీగా, గ్రామపంచాయతీగా, మళ్లీ మూడు గ్రామపంచాయతీలుగా, అనంతరం ఒక్క గ్రామపంచాయతీ ఏర్పాటు చేసే చిత్ర విచిత్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. చివరకు మేజర్‌ పంచాయతీగానే ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ చివరిసారిగా 2013లో ఎన్నికలు జరగ్గా, పాలకవర్గ కాలం 2018లో ముగిసింది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం భద్రాచలం, సారపాకలను మున్సిపాలిటీగా ప్రకటించగా, ఆదివాసీ నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. న్యాయస్థానంలో చుక్కెదురుకాగా భద్రాచలాన్ని మూడు గ్రామపంచాయతీలుగా విభజించింది. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మేజర్‌ గ్రామపంచాయతీగా కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. భద్రాచలం చివరి సర్పంచ్‌గా భూక్యా శ్వేత వ్యవహరించారు. ప్రస్తుతం తిరిగి మళ్లీ ఎస్టీ జనరల్‌కే సర్పంచ్‌ను కేటాయించారు. 20 వార్డుల్లో 10 వార్డులను ఎస్టీ జనరల్‌ మహిళలకు కేటాయించగా, మరో 5 వార్డులను జనరల్‌ విభాగంలోని మహిళలకు, మరో ఐదింటిని జనరల్‌కు రిజర్వేషన్‌ చేశారు. ఎన్నికలను అన్ని రాజకీయ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకుంటుండగా, ఆశావాహులు సమీకరణాల్లో మునిగిపోయారు. రాజకీయ పార్టీల పెద్దలతో టచ్‌లోకి వెళ్లారు. అధికార కాంగ్రెస్‌లో సర్పంచ్‌, జెడ్పీటీసీ పదవులకు విపరీతమైన పోటీనెలకొంది. దీంతో టికెట్‌ ఆశిస్తున్న నాయకులు ఎమ్మెల్యే, మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు.

సారొచ్చినా ఆఫీస్‌ తీయలే..



క్యాంపు ఆఫీస్‌కు తాళం వేసి ఉండటంతో వేచి చూస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణకు సోమవారం చేదు అనుభవం ఎదురైంది. మండల పరిషత్‌లో కుట్టు మిషన్ల పంపిణీ అనంతరం, ఆ వెనుకనే ఉన్న క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. అయితే క్యాంపు ఆఫీస్‌కు తాళం వేసి ఉంది. వాచ్‌మన్‌ కూడా అక్కడ లేడు. సమాధానం చెప్పేవారూ లేరు. దీంతో ఎమ్మెల్యే 15 నిమిషాలపాటు కార్యాలయ వరండాలో వేచిచూడాల్సి వచ్చింది. –అశ్వారావుపేట

కుల వ్యవస్థను నిర్మూలించాలి

మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

ఇల్లెందురూరల్‌: కుల వ్యవస్థ నిర్మూలనను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. కుల వ్యవస్థ నిర్మూలన వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని కొమరారం గ్రామంలో మాస్‌లైన్‌ ఆధ్వర్యంలో సోమవారం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ అణచివేత, ఆధిపత్యం కొనసాగిస్తున్న మనువాద హిందుత్వ భావజాలానికి, కుల దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా సత్యశోధక్‌ సమాజాన్ని ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే స్ఫూర్తితో ఉద్యమించాలని కోరారు. సమావేశంలో నేతలు ఆజ్మీర బిచ్చా, బుర్ర రాఘవులు, కాంపాటి పృథ్వి, బోస్‌, సావిత్రి, జగ్గులు, యలందర్‌, శాంతారావు, వాంకుడోత్‌ శంకర్‌ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

సత్యశోధక్‌ సమాజ్‌ స్ఫూర్తితో..

జూలూరుపాడు: మహాత్మా జ్యోతిరావు పూలే స్థాపించిన సత్యశోధక్‌ సమాజ్‌ స్ఫూర్తితో కుల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ (ఎంఎల్‌) మాస్‌లైన్‌ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాటోత్‌ కృష్ణ అన్నారు.సోమవారం అన్నారుపాడు గ్రామంలో నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. నాయకులు ఏదులాపురం గోపాల్‌రావు, బానోత్‌ ధర్మా, లింగాల వీరభద్రం, తోటకూరి నరేష్‌, బానోత్‌ ధన్వంతరావు, ఇరప రాజు, వీరు, నాగేశ్వరరావు, బాబు, వెంకన్న, నవీన్‌ పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు

కల్లూరురూరల్‌: మండలంలోని పోచవరం ప్రాథమిక వ్యవసాయ సహకారం పరపతి సంఘంలో సోమవారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. అయితే, సొసైటీకి 330 బస్తాల యూరియా రాగా, పెద్దకోరుకొండి, పోచవరం గ్రామాలకు 200 బస్తాలు కేటాయించారు. సోమవారం యూరియా పంపిణీ చేస్తారనే సమాచారంతో కూపన్లు తీసుకున్న రైతులు తెల్లవారుజామున 4గంటలకే చేరుకుని చెప్పులు క్యూలో పెట్టారు. కాగా, మిగిలిన 130 బస్తాలను తాల్లూరు వెంకటాపురం రైతులకు అందచేస్తామని ఉద్యోగులు తెలిపారు.



క్యూలో చెప్పులు పెట్టి వేచి ఉన్న రైతులు

కేటీపీఎస్‌ 8వ దశ నివేదిక రూపొందించాలి



టెన్నిస్‌ క్రీడా మైదానంలో క్రీడాకారులతో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

పాల్వంచరూరల్‌: కేటీపీఎస్‌ 8వ దశ నిర్మాణానికి నివేదిక రూపొందించాలని ఖమ్మం ఎంపీ ఆర్‌.రఘురాంరెడ్డి సూచించారు. 8వ దశ సాధన కమిటీ, టీఆర్‌వీకేఎస్‌ ఆధ్వర్యంలో కేటీపీఎస్‌ కాలనీలో సోమవారం ఎంపీని పూలమాలలు, శాలువాలతో వేర్వేరుగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేటీపీఎస్‌లో 8వ దశ కర్మాగార నిర్మాణంపై పార్లమెంట్‌లో చర్చకు లేవనెత్తగా కేంద్ర విద్యుత్‌ శాఖ సహాయ మంత్రి శ్రీపాద నాయక్‌ కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో 8వ దశ సాధన సమితి అధ్యక్షుడు సీతారాంరెడ్డి, కన్వీనర్‌ మంగీలాల్‌, టీఆర్‌వీకేఎస్‌ యూనియన్‌ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చారుగుండ్ల రమేష్‌, మార్క్‌ఫెడ్‌ డైరెక్టర్‌ మాజీ డైరెక్టర్‌ కొత్వాల శ్రీనివాసరావు, పెద్దమ్మగుడి చైర్మన్‌ బాలినేని నాగేశ్వరరావు, ఆళ్ల మురళి, చందుపట్ల శ్రీనివాసరెడ్డి, మహిపతి రామలింగం, రవికుమార్‌, రాంబాబు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌ ట్రాక్‌ నిర్మించాలని విన్నపం

పట్టణంలోని శ్రీనివాసకాలనీ శివారులో ఉన్న టెన్నిస్‌ క్రీడామైదానాన్ని ఎంపీ రఘురాంరెడ్డి సందర్శించారు. క్రీడాకారులు, క్రీడా సంఘాల బాధ్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా అథ్లెటిక్స్‌ ట్రాక్‌, డ్రెయినేజీ తదితర సమస్యలు పరిష్కరించాలని జిల్లా టెన్నిస్‌, ఒలంపిక్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు డాక్టర్‌ యుగంధర్‌రెడ్డి విన్నవించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మిక ప్రాంతం రామవరంలోని 7 నంబర్‌ బస్తీలో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి సోమవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి సందర్శించారు. ప్రత్యేక పూజలు చేశారు. కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఆళ్ల మురళి, చీకటి కార్తీక్‌, పీతాంబరరావు, హరి సింగ్‌, ఉత్సవాల నిర్వాహకులు పాల్గొన్నారు.

5న సీపీఐ 'శత వసంతాల' సమావేశం



ఖమ్మంమయూరిసెంటర్‌: సీపీఐశత వసంతాల ముగింపు సభ డిసెంబర్‌లో ఖమ్మంలో జరగనుండగా, నేపథ్యాన అక్టోబర్‌ 5న సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు భద్రాద్రి, ఖమ్మం జిల్లాల కార్యదర్శులు ఎస్‌.కే.సాబీర్‌ పాషా, దండి సురేష్‌ తెలిపారు. ఖమ్మం ఎస్‌ ఆర్‌ గార్డెన్స్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగే సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, బినాయ్‌ విశ్వం, కె.నారాయణ, అజీజ్‌ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, చాడ వెంకటరెడ్డి హాజరవుతారని వెల్లడించారు. అలాగే, ఆహ్వాన సంఘ సమావేశానికి తెలంగాణతో పాటు వివిధ ఇతర రాష్ట్రాల నేతలు పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ, ఎం.వీరపాండ్యన్‌, మహ్మద్‌ సలీం, సుందరేష్‌, పర్ల పద్మ, శ్రీనివాస్‌, ఈటి నర్సింహా, బాగం హేమంతరావు తదితరులు కూడా పాల్గొంటారని తెలిపారు.

కాంట్రాక్ట్‌ కార్మికులకు అందని లాభాల వాటా

సింగరేణి యాజమాన్యం తీరుతో ఆందోళన

సింగరేణి (కొత్తగూడెం): లాభాల వాటా నగదును పర్మనెంట్‌ కార్మికులకు అందించిన సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్‌ కార్మికులకు అందించలేదు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి లాభాల వాటాలో కాంట్రాక్ట్‌ కార్మికులు ఒక్కొక్కరికి రూ. 5,500 ఇస్తామని సంస్థ ప్రకటించిన విషయం విదితమే. కాంట్రాక్టర్లు, సింగరేణి యాజమాన్య వైఖరితో లాభాల వాటా చెల్లింపుల వ్యవహారం సందిగ్ధంలో పడింది. గతేడాది ఒక్కొక్కరికి రూ.5 వేలు చెల్లించారు. ఇందుకు సంబంధించిన జీఎస్టీ, ఇన్‌కమ్‌ టాక్స్‌ చెల్లించలేదు. దీంతో ఆ భారం సుమారు రూ.16 లక్షలు కాంట్రాక్టర్లే భరించాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది లాభాల వాటా నగదు చెల్లించేందుకు కాంట్రాక్టర్లు జాప్యం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ఉన్న సుమారు 1,213 మంది కాంట్రాక్టర్లు సోమవారం కాంట్రాక్ట్‌ కార్మికుల ఖాతాల్లో నగదు జమ చేయలేదు. ఏడాది నుంచి సమస్య పరిష్కరించకుండా యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రెండు శాతం ఇన్‌కమ్‌ టాక్స్‌, జీఎస్టీని కాంట్రాక్టర్లకు నెలవారీ లేబర్‌ బిల్లులతోపాటు కలిపి చెల్లించే అవకాశం ఉన్నా యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదు. దీంతో సంస్థవ్యాప్తంగా 32 వేల మంది కాంట్రాక్ట్‌ కార్మికులు లాభాల వాటా నగదు అందక నిరాశకు గురయ్యారు. కాగా, కాంట్రాక్ట్‌ కార్మికులకు లాభాల వాటా చెల్లింపులో కొర్రీలు పెట్టడం సరికాదని ఇఫ్టూ రీజియన్‌ కార్యదర్శి ఎన్‌.సంజీవ్‌ పేర్కొన్నారు. పండుగ వేళ కార్మికులు పస్తులు ఉండకుండా వెంటనే చెల్లించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

నకిలీ నోట్ల కలకలం

ముగ్గురు పూల వ్యాపారులకు టోకరా



నకిలీ నోటును చూపుతున్న వ్యాపారి

కొత్తగూడెంటౌన్‌: కొత్తగూడెం సూపర్‌బజార్‌ ఏరియాలో సోమవారం ముగ్గురు పూల వ్యాపారులకు నకిలీ రూ.500 నోట్లను అంటగట్టి దుండగులు ఉడాయించారు. అడవి కంబాలపల్లి(ఇల్లెందు)కి చెందిన వీరభద్రం, సుజాతనగర్‌ మండలం రాఘవపురానికి చెందిన సిద్దెల వంశీ, మరో మహిళ బతుకమ్మ పూలు విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఒక్కో వ్యాపారి వద్ద రూ.100 గునుగు పూలను కొన్నారు. రూ.500 నకిలీ నోటు ఇచ్చి, వ్యాపారి నుంచి రూ.400 తీసుకుని వెళ్లిపోయారు. వ్యాపారులు ఆ నోట్లను గుర్తించేలోపే దుండగులు అక్కడి నుంచి జారుకున్నారు. నోట్లపై ఒకవైపు ముద్రణ ఉండగా మరో వైపు తెల్లగా ఉంది. దొంగ నోటు ఇచ్చిన వ్యక్తులను గుర్తించేందుకు సీసీ కెమెరా కూడా లేక పోవడంతో చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు. దొంగనోట్లను అంటగట్టిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

2 క్వింటాళ్ల గంజాయి సీజ్‌

బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లి బంజర వద్ద సోమవారం తెల్లవారుజామున బూర్గంపాడు ఎస్సై మేడా ప్రసాద్‌ అనుమానాస్పద రీతిలో వేగంగా వెళ్తున్న ఓ కారును పట్టుకుని సోదాలు నిర్వహించారు. వాహనంలో తరలిస్తున్న 2.05 క్వింటాళ్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కారు నడుపుతున్న వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణ పూర్తయ్యాక వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్‌ అధికారులు

భద్రాచలంలో 10 కిలోలు..

భద్రాచలంటౌన్‌: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న ఆర్టీఓ చెక్‌ పోస్ట్‌ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన ఎక్సైజ్‌ అధికారులు బైక్‌పై తరలిస్తున్న 10.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని, గంజాయి తరలిస్తున్న సూర్యాపేట జిల్లాకు చెందిన గోళ్ల గణేష్‌, మూరగుండ్ల ఆనంద్‌కుమార్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి భద్రాచలం మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. నిందితులను భద్రాచలం ఎక్సైజ్‌ స్టేషన్‌లో అప్పగించారు. పట్టుకున్న గంజాయి విలువ సుమారు రూ.10 లక్షల వరకు ఉంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్‌ ఎస్‌ఐ సీహెచ్‌ శ్రీహరిరావు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు

పాల్వంచరూరల్‌: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కేసీఆర్‌ నగర్‌కు చెందిన బానోతు రాజేంద్రప్రసాద్‌(37) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏడు నెలల క్రితం డ్రెయినేజీ దాటుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో పడటంతో రెండుకాళ్లు విరిగి గాయపడ్డాడు. పనులకు వెళ్లలేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. దీంతో మనస్తాపం చెంది ఈ నెల 7న పురుగుల మందుతాగాడు. వరంగల్‌ ఎంజీఎం తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పట్టణ ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

'చాంబర్‌' ఎన్నికలకు సమాయత్తం

మూడేళ్లకోసారి ఆఫీస్‌ బేరర్లు, 19శాఖల ప్రతినిధుల ఎన్నిక



ఎన్నికల ప్రచారం చేస్తున్న అభ్యర్థులు

ఖమ్మంగాంధీచౌక్‌: ఖమ్మం చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ఆఫీస్‌ బేరర్లు, 19 వ్యాపార శాఖల విభాగాల ప్రతినిధులను మూడేళ్లకోసారి ఎన్నుకుంటారు. ఈమేరకు వ్యాపారులు ప్యానెళ్లుగా ఏర్పడి బరిలో నిలుస్తారు. ఈసారి అధ్యక్షుడిగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్‌, ప్రధాన కార్యదర్శిగా గొడవర్తి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా కురువెళ్ల కాంతారావు, సహాయ కార్యదర్శిగా బాదె రమేష్‌, కోశాధికారిగా తూములూరి లక్ష్మీనరసింహారావు పోటీ చేసేలా మరికొందరితో ప్యానల్‌ ఏర్పాటైంది. ఈ ప్యానల్‌ బాధ్యులు సోమవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులను కలిసి తమను గెలిపించాలని అభ్యర్థించారు. వీరికి మద్దతుగా పత్తిపాక రమేష్‌, పొలవరపు కోటేశ్వరరావు, మాటేటి రాకేష్‌, చిలకల ఆదినారాయణ, వడ్డే వెంకటేశ్వర్లు, సోమవరపు సుధీర్‌కుమార్‌, ప్రభాకర్‌, బజ్జూరి రమణా రెడ్డి, బండి సతీష్‌ సిరికొండ వెంకటేశ్వర్లు, గుడిపూడి నరసింహారావు ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ హయాంలోనే అభివృద్ధి

రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి: కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాకే అభివృద్ధి పరుగులు తీస్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మండలంలోని అమ్మగూడెం, కోనాయిగూడెం, నేలకొండపల్లిల్లో సోమవారం ఉదయం ఆయన బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసి మాట్లాడారు. అలాగే, ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించారు. మార్కెట్‌ చైర్మన్‌ వెన్నపూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్‌, భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, బొందయ్య, అడపాల రామారావు, నల్లాని మల్లికార్జున్‌రావు, రాయపూడి నవీన్‌, నంబూరి రామారావు, యర్రబోయిన నర్సయ్య, పెంటమళ్ల పుల్లమ్మ, కొచ్చెర్ల శ్రీనివాసరావు, కొమ్మినేని పుష్పావతి, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్‌బాబు, కడియాల నరేష్‌, ఇస్లావత్‌ బాలాజీ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో మంత్రి

కూసుమంచి: మండలంలోని నాయకన్‌గూడెం జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం రాత్రి నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలతో ఆడిపాడిన ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు.